నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 17 మార్చి 2025
MONDAY, MARCH 17, 2025

## వైభవంగా సంత్ తుకారం మహరాజ్ బీజ్ దినోత్సవం



కీర్తనలు చేస్తున్న వార్కారీలు

కోటగిరి, మార్చి 16 : మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర మందిరంలో శ్రీ సంత్ తుకారాం మహరాజ్ బీజ్ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా3 విజయ్ మహరాజ్, దొండిబా మహరాజ్ మాట్లాడుతూ... సంత్ తుకారాం మహరాజ్ తన భక్తితో శ్రీమహా విష్ణువుని దర్శనం చేసుకున్నారని, శరీరంతో వైకుంఠానికి తీసుకెళ్లిన రోజు నుంచి మార్చి 16న సంత్ తుకారాం మహరాజ్ పుణ్యతిథి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాంచంద్రారావు కులకర్ణి, దొండిబా, గంధపు ప్రకాశ్, అశోక్, అనిల్ కులకర్ణి, డాక్టర్ సాయిలు, ఎల్లప్ప, శివరాజ్‌పటేల్, కట్టు నగేశ్, శకుంతల, కళావతి, నీలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మోస్రా (చందూర్), మార్చి 16 : మోస్రా మండలంలోని గోవూర్ గ్రామంలో ఇటుక బట్టీలో పనిచేస్తున్న కార్మికులకు లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. 30 మందికి దస్తులను అందజేశారు.

## 'గిరీశం జీవన గమనం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు

మోస్రా (చందూర్), మార్చి 16 : మోస్రా మండలంలోని చింతకుంట అనాథ వృద్ధాశ్రమంలో గిరీశం జీవన గమనం (ఆత్మకథ) పుస్తకాన్ని రచయిత గుడిపల్లి గిరీశం రెడ్డి వృద్ధాశ్రమ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గుడిపల్లి గిరీశంరెడ్డి పోస్టుమెన్‌గా విధులు నిర్వహించి రిటైర్ అయ్యారని, అనాథాశ్రమాలు, సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సామన్య వ్యక్తి సమాజానికి ఎలా అవసరపడాలనే అంశాలతో తాను పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. అనాథాశ్రమ వ్యవస్థాపకుడు మోహన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ ఉపాధ్యక్షుడు గుడిపల్లి గిరీశంరెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ బండ్లపై పట్టింపేదీ..?

- మూలకుపడ్డా పట్టించుకోని అధికారులు
- వాహనాలను కవర్లతో కప్పేసిన వైనం
- రిపేరు చేయిస్తే అందుబాటులోకి..

ఆర్మూర్‌టౌన్, మార్చి 16: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరించే వాహనాలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. చిన్నపాటి రిపేర్లు కూడా చేయించకపోవడంతో అవి మూలన పడ్డాయి. లక్షల రూపాయల విలువ చేసే బండ్లు నిర్వహణను పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్మూర్ బల్దియాలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు అధికారుల తీరు ఉన్నది. అధికారులు తమ డ్యూటీ చేస్తున్నారు తప్ప తమ కార్యాలయ పరిధిలో ఉన్న చెత్త బండ్లు మూలకు పడ్డా పట్టించుకోవడం లేదు. చెత్త సేకరణ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణ బండ్లు కొన్ని మూలకు పడడంతో ఇబ్బందిగా మారింది. తక్కువ బండ్లు ఉండడంతో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు కూడా ఇండ్ల వద్దకు వస్తున్నాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చెత్త ఇండ్లలోనే ఉంటున్నది. సరైన సమయంలో బండి రాకపోవడంతో ఇంట్లోని చెత్తను రోడ్లపై, కాలనీల్లో మూలన వేస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్త సేకరణ వాహనాలకు రిపేరు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మూలకు పడిన చెత్త సేకరణ బండ్లు

## కొనసాగుతున్న పన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్



పన్ను వసూలు ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్

కంఠేశ్వర్, మార్చి 16 : నగరంలో పన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం చేపట్టిన పన్ను వసూళ్ల ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. పన్ను చెల్లించకుంటే నిబంధనలకనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

## ద్విచక్రవాహనం చోరీ

పోతంగల్, మార్చి 16 : కిరాణా దుకాణం ఎదుట నుంచి ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. హంగర్గా గ్రామంలోని ఆబాది బీసీ కాలనీలో ఇందూరు గంగాధర్ ఈనెల 14న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన ఇంటి ఎదుట ఉన్న కిరాణా దుకాణం వద్ద టీఎస్ 16 ఈజీ 0010 నంబర్ గల హీరో ఐ స్మార్ట్ ద్విచక్రవాహనాన్ని నిలిపి ఉంచాడు. ఇంట్లోకి వెళ్లి మూడు గంటల సమయంలో బయటకి వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, వాహనం ఆచూకీ తెలిస్తే 8712659878 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

## మొరం టిప్పర్ సీజ్

చందూర్, మార్చి 16 : మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి చెరువులో మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ శాంత ఆదివారం తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

# కొనసాగుతున్న నిరవధిక దీక్ష



డిచ్‌పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరికొండ/ చందూర్/ డిచ్‌పల్లి, మార్చి 16 : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరవధిక దీక్షలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. సిరికొండ మండల కేంద్రలో రిలే నిరాహార దీక్షను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పెర సంజీవ్ మాదిగ హాజరై మాట్లాడారు. మాదిగలకు 9 శాతం కాకుండా 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు మాదిగలకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సంపత్, గణేశ్, రాజన్న, సంజు, కృష్ణ, సతీశ్, వెంకటేశ్, నర్సయ్య, సంజీవ్, సాయన్న, బక్కన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

చందూర్ మండలకేంద్రంలో చేపట్టిన దీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నది. ఎస్సీ వర్గీకరణ అమలు చేసేవరకు, పోటీ పరీక్షల ఫలితాలు విడుదల చేయెద్దని కోరారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జి డప్పు నర్సయ్య ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు రాష్ట్ర కో-ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ నగర శాఖల సంగమం

సుభాష్‌నగర్, మార్చి 16 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఇందూరు నగర శాఖల సంగమ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ధర్మా జాగరణ్ ప్రతినిధి అమర లింగన్న హాజరై మాట్లాడారు. హిందువులు సంఘటితంగా ఉంటూ, జాతి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. నగర నలుమూలల నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మైదానం కిక్కిరిసింది. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నగర ప్రతినిధి అర్గుల సత్యం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

## మట్టికుండ.. ప్రయోజనాలు నిండా!

కోటగిరి, మార్చి 16 : వారం రోజులుగా ఎండలు మండుతున్నాయి. దీంతో మట్టి కుండలు, రంజన్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రజలు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కుండల్లోని నీరు ఆరోగ్యకరమని, వంటలు నాణ్యంగా ఉంటాయని నిపుణులు సూచిస్తుండడంతో వీటిపై మొగ్గు చూపుతున్నారు. గతంలో వేసవిలో మాత్రమే తాగునీటి కోసం ఎక్కువ మంది కొనుగోలు చేసేవారు కానీ ప్రస్తుతం ఏడాది పొడవునా మార్కెట్‌లో మట్టి కుండలు అందుబాటులో ఉంటున్నాయి. కోటగిరి మండల కేంద్రంలో మట్టి కుండలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. పేదలకు అందుబాటులో ఉండేలా ధరలు ఉన్నాయని వ్యాపారి కుమ్మరి హన్మాండ్లు తెలిపారు.



కోటగిరిలో అమ్మకానికి ఉన్నమట్టి కుండలు

## పదో తరగతి విద్యార్థులకు అభినందన సభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, మార్చి 16 : జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. గత నెల 16న నిర్వహించిన పదోతరగతి ప్రతిభా పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి డీఈవో అశోక్ హాజరై మాట్లాడారు. ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వార్షిక పరీక్షలు రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు గణేశ్, మహేశ్, దుర్గ, వేణు, బాబూరావు పాల్గొన్నారు.



ఇందల్వాయిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న కందాల రాజగోపాల్‌కు సీవీ రామన్ అకాడమీ పురస్కారాన్ని హైదరాబాద్‌లో ఆదివారం అందుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, ఆలయాల ఉద్ధరణ, చేపడుతున్న ధార్మిక కార్యక్రమాలు, విదేశాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన, పేద విద్యార్థుల చదువుకు అందజేస్తున్న సహకారం తదితర సేవలకు ఉగాది పురస్కారాల్లో భాగంగా అవార్డును అందజేసినట్లు అకాడమీ ప్రతినిధులు తెలిపారు.

– ఇందల్వాయి, మార్చి 16

## మడ్ బాత్



మట్టి స్నానం చేస్తున్న యోగా సాధకులు

*మండలంలోని రాణాకలాన్ గ్రామ శివారులో ఉన్న అలీసాగర్ బోటింగ్ పాయింట్ వద్ద పతాంజలి యోగిరత్న ఎత్తొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో యోగాసాధకులు ఆదివారం మట్టిస్నానాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. మట్టిస్నానం చేయడంతో శరీర రుగ్మతలు తొలగిపోతాయని అన్నారు. ఇకనుంచి ప్రతినెలా మట్టిస్నానాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ లోక్యానాయక్, సూర కిరణ్, 300మంది యోగా సాధకులు పాల్గొన్నారు.*

*- ఎడపల్లి, మార్చి 16*

# ఎస్సీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



సాలూరలో దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆర్మూర్ తహసీల్ కార్యాలయం ఎదుట..

**కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు**

ఆర్మూర్ టౌన్/ బోధన్ రూరల్, మార్చి 16: ఆర్మూర్ పట్టణంలోని తహసీల్ కార్యలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా, ప్రభుత్వ ఉద్యోగాల ఫలితాలు విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

సాలూరాలో ఎమ్మార్పీఎస్ దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం రిలే దీక్షలో దీక్షలో లింబూరి లక్ష్మణ్, పోచీరాం కూర్చున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో ఎస్సీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

ఆర్మూర్‌టౌన్, మార్చి16: మద్యం తాగి ఎవరూ వాహనాలు నడుపరాదని ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో శనివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాలని వాహనదారులకు సూచించారు.

## ట్రాన్స్‌కో రెంజల్ ఏఈగా మగ్దుం బాధ్యతల స్వీకరణ

రెంజల్, మార్చి 16: ట్రాన్స్‌కో రెంజల్ మండల ఏఈగా ఎండీ మగ్దుం బాధ్యతలు చేపట్టారు. రెండు సంవత్సరాలుగా ఇక్కడ పలువురు ఇన్‌చార్జి ఏఈగా పనిచేస్తున్నారు. ఆసిఫాబాద్ ఏఈగా విధులు నిర్వహించిన మగ్దూమ్‌ను ఇటీవల రెంజల్ మండలానికి బదిలీచేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఎట్టకేలకు పూర్తిస్థాయిలో ఏఈని నియమించడంతో మండల ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

మోర్తాడ్, మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం డిమాండ్ చేశారు. మోర్తాడ్‌లోని అమరవీరుల స్తూపం వద్ద విద్యపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. విద్యారంగానికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగాధర్, సంతోష్, జాంభవ తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రరీ ఆవరణలో చెట్లు పెంచడం అభినందనీయం



రికార్డులు తనిఖీ చేస్తున్న రాజారెడ్డి

మాక్లూర్, మార్చి 16: లైబ్రరీ ఆవరణలో చెట్లు పెంచడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. మాక్లూర్‌లోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. లైబ్రరీలోని రికార్డులను తనిఖీ చేశారు. పాఠకుల కోసం ఉన్న పుస్తకాలను పరిశీలించి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక పుస్తకాలు అందుబాటులో ఉంచడంపై సంతోషం వ్యక్తంచేశారు. లైబ్రరీ పరిసరాలు శుభ్రంగా ఉండడంతో లైబ్రేరియన్ నరేశ్‌రెడ్డిని అభినందించారు. లైబ్రరీ నిర్వహణ తీరు, అందుబాటులో ఉంచిన పుస్తకాలను చూసి ఆయన సత్పృప్తి వ్యక్తంచేశారు.

## బెల్టు షాపులపై దాడి

బీబీపేట (దోమకొండ), మార్చి 16: బీబీపేట మండలంలోని ముత్యంపేట గ్రామంలో మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై ఎస్సై స్రవంతి సిబ్బందితో కలసి శనివారం రాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా 34 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని బెల్ట్ షాపు యాజమాని భూమయ్యపై కేసు నమోదు చేశారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో మున్సిపల్ కార్మికులు

మోర్తాడ్(భీమ్‌గల్), మార్చి 16: భీమ్‌గల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సున్నపు ఓంకార్, ఉపాధ్యక్షురాళ్లుగా కొంద్ర విజయ, బాలమణి, కార్యదర్శిగా విశ్వనాథం, కోశాధికారిగా నవీన్, సహాయ కార్యదర్శులుగా మధు, మనోహర్, సలహాదారులుగా గుర్రం చిన్నరాజన్న, పోశన్న, ప్రవీణ్, రఘు, పోసాని, లక్ష్మీ ఎన్నుకయ్యారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం తెలిపింది. కొత్త కార్యవర్గాన్ని మున్సిపల్ కార్మికులు అభినందించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**నలుగురికి తీవ్ర గాయాలు**

ఆర్మూర్‌టౌన్, మార్చి 16: ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ శివారులో ఉన్న మహిళా ప్రాంగణం వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇషాద్, మనీశ్, కర్ణల్ కలిసి భీమ్‌గల్‌లో పని పూర్తిచేసుకొని బైకుపై నిర్మల్‌వైపునకు వెళ్తున్నారు. పెర్కిట్‌లోని మహిళా ప్రాంగణం సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొన్నది. ఇషాద్ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే కారు ముందర ఆగిన కంటెయినర్‌ను ఢీకొన్నది. దీంతో రాహుల్, గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.



కంటెయినర్‌పే వెనుక నుంచి ఢీకొన్న కారు

## కందకుర్తి- నిజామాబాద్ ఆర్టీసీ బస్సు ట్రిప్పులు పెంచాలి

రెంజల్, మార్చి 16: నిజామాబాద్ –2 డిపో వయా దూపల్లి మీదుగా కందకుర్తి వరకు నడిచే బస్సు సర్వీసులను పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రయాణికులు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు. నిజామాబాద్ బస్టాండ్ నుంచి ఉదయం, సాయంత్రం సమయంలో కందకుర్తి వరకు నడిచే బస్సు సర్వీసుకు అదనంగా ట్రిప్పులు పెంచి, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించాలని కోరారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగే అవకాశం కూడా ఉన్నదని పేర్కొంటున్నారు. కందకుర్తి –నిజామాబాద్ రూట్‌లో వారంతపు సంతలు, పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

## ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటివిడుదల

మోర్తాడ్, మార్చి16: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటలకు నీటివిడుదల కొనసాగుతున్నది. కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 250, అలీసాగర్ ఎత్తిపోతలకు 463, గుత్ప ఎత్తిపోతలకు 270, సరస్వతీ కాలువకు 700, వరదకాలువకు 375, మిషన్ భగీరథ కోసం 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ఆదివారం ప్రాజెక్ట్‌లో 1070.70 అడుగుల (24.515టీఎంసీల) నీటి నిల్వ ఉన్నది.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మోర్తాడ్, మార్చి 16: పాలెం ఉన్నత పాఠశాలలో 2007–2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి ఆహ్లాదంగా గడిపారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి గురుభక్తిని చాటారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## మోర్తాడ్‌లో ఎమ్మెల్యే వేముల పూజలు

మోర్తాడ్, మార్చి 16: మోర్తాడ్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ జాతర సందర్భంగా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మోర్తాడ్, కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు కల్లెడ ఏలియా, రేగుంట దేవేందర్, మాజీ జడ్పీటీసీ బద్దం రవి, బోగ ఆనంద్, గోపిడి సత్యానారాయణ, చిన్న రాజేశ్వర్, ఏనుగు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో